సద్గురుపరబ్రహ్మణేనమః

# అష్టావక్ర గీత

-విద్యాసాగర్ స్వామి వారి బోధ

నిద్ర ఎక్కడ నుండి వస్తోంది?

(శరీరమా, ప్రాణమా మనసా, బుద్ధా)

హరిఃఓం

శ్రీ గురుభ్యోన్నమః

హరిఃఓం

శి: జ్ఞానార్జనకు మార్గము ఏది? ముక్తిని ఎలా సాధించడం? వైరాగ్యం ఎలా నిలుస్తుంది? నామీద కరుణించి అనుగ్రహించండి.

గు: అదిట సంగతి. అడుగుతున్నది ఎవరు ఇప్పుడు!? నేనే. నువ్వే అడుగుతున్నావు. నీ స్థానంలో జనకమహారాజు ఉండి అడిగిస్తున్నాడంతే. అలా రాశారు దానిని. అర్థమైందాండి! ఇప్పుడు ఏం అడుగుతున్నాడండి మన ప్రశ్నలేనా అవి? జ్ఞానాన్ని ఆర్జించడం ఎలాగా? ముక్తిని సాధించడం ఎలాగా? వైరాగ్యం నిలబడటం ఎలాగా? ఈ మూడు సమస్యలు మనవేనా? స్వరూపజ్ఞానము నిలబడటము లేదు. ముక్తిని పొందటం ఎట్లాగ అంటున్నాడా లేదా? పొందటం ఎట్లాగ అంటే, సాధించడం ఎట్లాగ, వైరాగ్యం నిలబడటములేదు. వచ్చిన వైరాగ్యము ఏమో నిలబడటము లేదు. వైరాగ్యము ఇప్పుడు లేదా మనలో? ఉంది. కానీ ఏంలేదు? నిలబడటము లేదు. అర్థమైందాండి! ఈ మూడూ చేయడం ఎలాగా అని అడుగుతున్నాడు. ఏం చెప్పారు సమాధానం?

శి: రోగి తన రోగ నివారణ కోసం వైద్యుడి దగ్గరకు వెళ్ళినప్పుడు తన బాధలు వీలైనంత స్పష్టముగా తెలియపరచాలి.

గు: తెలియపరచాలి కదా మరి! మీరందరూ అలాగే తెలియపరుస్తారా! డాక్టర్ గారే టెస్టులు అన్నీ చేసుకుని ఆయనే డిసైడ్ చేసుకుంటాడు. నీకేమి అనారోగ్యం అని కదా!అప్పుడు వైద్యం జరుగుతుందా! సరిగా జరుగుతుందా? ఔనా కాదా! ఇప్పటివరకు నీ దోషమంతా ఇదే. నీ సమస్య ఏమిటో నువ్వు స్వయంగా చెప్పవు. గురువు గారే నీ మనసులోనో, హృదయములోనో దూరి నిన్ను అర్థం చేసుకొని, నువ్వు ఏమీ చెప్పకుండానే నీకు అన్నీ చెప్పాలి. ఎందుకని? గురువుగారు అంటే అలాంటి లక్షణాలు ఉండాలండి అని నేను అనుకున్నాను.

భగవాన్ రమణులు క్రోధం చెందితే ఇటువంటి అంశము లోనే క్రోధము చెందుతారు. ఆయనకు ఎప్పుడూ కోపము రాదు మహానుభావుడు. గురువుని పరీక్షించే స్థాయికి ఎట్టా వచ్చాడు అసలు? గురువు అంటే నీ నిర్వచనం ఏమిటి మధ్యలో, నీ నిర్వచనముతో పనిలేదు.

శి: పరీక్షించటం ఏమిటి?

గు: డాక్టర్ దగ్గరకు వెళ్ళిన వాడు భాద నుంచి విముక్తుడవ్వడమే అతని ప్రధాన కర్తవ్యం. అంతేనా కాదా! అప్పుడు నీ గురించి నీవే వ్యక్తీకరించు కోవాలి. నా సమస్య ఇదండీ, నా సమస్యను పరిష్కరించమని నువ్వు అడగాలి,అర్థించాలి. కాని గురువు దగ్గరికి వెళ్ళి నువ్వు మౌనంగా కూర్చున్నావండి, అప్పుడు ఏం చేయాలి గురువు?

శి: వ్యక్తీకరించటం రాలేదండి.

గు: సాధారణముగా ఇంకా ఎక్కువ, అర్థమైందాండి! ఈ విపరీత జ్ఞానమే ప్రమాదకరము అన్నమాట. అర్థమైందాండి! ఇలాంటి వాటి వల్ల మేలు జరగదు అని అక్కడ చెబుతున్నాడన్నమాట. నీకెందుకు ఇలా తగాదా పెరిగిపోతుంది అంటే నీ విపరీత జ్ఞానము వలననే

శి: ఇది జ్ఞానం ఎట్లా అవుతుంది?

గు: ప్రభావితమైన జ్ఞానం కదా అది. ఎప్పుడో ఇవన్నీ నీ మనసులో పెట్టుకున్నావు. గురువు అంటే అలా ఉండాలి, గురువు అంటే ఇలా ఉండాలి, గురువు అంటే ఎప్పుడూ సమాధినిష్ఠలో ఉంటాడు. గడ్డాలు మీసాలు పెరిగిపోయి ఎక్కడో అలా ఉంటాడు ఇలా ఉంటాడు. దేవుడు అంటే 16 చేతులు, నాలుగు తలకాయలు అలా ఉంటాడు. ఇలాంటివన్నీ కూడా నువ్వు ఒక ఊహా చిత్రణలో ఉంటాము అన్నమాట ఎప్పుడూ కూడాను. మామూలుగా నీలాగా ఉంటే నువ్వు ఒప్పుకో లేవన్నమాట. దానికి కారణం భ్రమాజన్య జ్ఞానం. కానీ గురువు ఎటువంటి వాడై ఉండాలి? ఆచార్యుడు ఎటువంటి వాడై ఉండాలి? నీ వలెనే ఉండాలి. నీ వలెనే తినవలే, నీ వలెనే నిద్రించవలె. అర్థమైందాండి! కానీ నీవు ఉన్నట్లు కాదు. ఒకటే నిదర్శనం ఏంటయ్యా అంటే  నీ వలె ఉండాలి. నీవలె జీవించాలి, నీ వలె తినవలె,  నీవలె నిద్రపోవాలి. కానీ నీవు చేసినట్లు కాదు. చేత లోనే తేడా ఉందంతే. చేసే క్రియలో తేడాలేదు.  నువ్వు భోజనం చేసావు, నేను భోజనం చేశాను ఏమిటి తేడా? ఇందాక చెప్పా చూడండి! ఆ భేదం ఉందా లేదా! ఉంటుంది సహజంగా ఎందుకని?  సహజంగా నువ్వు ఆ నిష్టలో ఉన్నప్పుడు నీ ప్రయత్నపూర్వకముగా

ఏమీ అవసరం లేదు అక్కడ. ఎందుకని? నిజ జీవితం మొత్తం అదే పరుచుకు పోయింది.

ఇప్పుడు ఎవరైనా ఏమండీ... మహా శివరాత్రి నాడు ఉపవాసం ఉన్నారా అని అడిగాతిరనుకోండి? మాది నిత్యోపవాసదీక్షండి అంటూ ఉంటాము. అప్పుడు ఏమైంది? అతడు ఎట్లాగు నన్ను అడగడు. ఆ నిత్యోపవాసదీక్ష అంటే అడుగుతాడా? వీడితో నాకెందుకులే తగాదా వదిలేస్తాం. అధవా! ఒకవేళ అడిగాడే అనుకోండి! వివరించి చెప్తాం. నాయనా ఇది జీవితానికి ప్రయోజనకరం. 365 రోజులలో ఒక్క మహా శివరాత్రి నాడు ఉపవాసము పేరుమీద అన్ని ఆహారాలను తలుచుకుంటూ ఎందుకు ఆ కూర్చోవటం, ప్రయోజనం ఏముంది? అంతేనా కాదా! మహా శివరాత్రినాడు రాత్రి జాగారం చేయాలా అక్కర్లేదా? ఏం చేయాలి జాగారం చేయాలంటే మనకు ఏం కావాలి? మహా శివరాత్రి నాడు రాత్రిపూట జాగరణ చేస్తావా? మేలుకుంటావా? మేలుకోవాలి అంటే ఏం కావాలి? రెండు మూడు సార్లు టీ కావాలి. ఇంకా టీవీ కావాలి. కనీసం మూడు సినిమాలు అన్నా

వాడు వేయాలి. అందులో ఏమి చేస్తాడో అని పదహారు చానల్స్ మనం తిప్పటంతో సగం పోతుంది. ఇప్పుడు ఇది జాగరణ అవుతుందా? అర్థమైందాండి!

పూర్వము మహాశివరాత్రి ఆచరించే వాళ్ళకు రెండు నియమాలు ఉండేవండి ! ఒకటి మౌనం. ఒకటేమి చేయాలండి? ఆ రోజు సూర్యోదయం లగాయతు మళ్ళా సూర్యోదయం వరకు మౌనం వహించాలి మాట్లాడకుండా. మాట్లాడకూడదు కదా అని పలక పెట్టుకుని రాయడం సంజ్ఞలు చేయటం కాదు. మౌనం అంటే మౌనమే అర్థమైందాండి! దైహిక క్రియలకు తప్ప ఇతరములైన వాటికి దేహాన్ని చలింప చేయకూడదు. కదల్చకూడదు అలా మౌనాన్ని పాటించాలి. అలాగే దైహిక క్రియలకు అవసరమైనటువంటి అత్యంత తేలికైనటువంటి తీర్థమో, లేకపోతే మరొకటో మంచినీరో చేసినంత మాత్రాన వచ్చిన ప్రమాదం ఏమీ లేదు. అది కూడా ఉపవాసమే. కొంతమంది మంచినీరు కూడా పుచ్చుకోకుండా ఉపవాసం ఉంటారే అనుకోండి! దానివల్ల ఏమి ప్రయోజనం లేదు. కారణం ఏమిటి? దైహిక క్రియలకు అడ్డమవుతుంది. కాబట్టి శరీరత్రయాలకు అవసరమైనటువంటి మంచి నీళ్ళు తాగుతూ, మౌనాన్ని వహించి దృష్టిని భ్రూమధ్యమున నిలిపి నీవు కనుక

ఉన్నట్లైతే జాగరణ చేయడానికి ఇవేమీ అవసరము లేదు. టీవీ అవసరం లేదు, సినిమా అవసరము లేదు, టీ అవసరం లేదు, ఏమి అవసరం లేదు. ఎందుకనిట?

అక్కడ అంశం ఏమిటంటే... నీకు నిద్ర ఎక్కడి నుంచి వస్తోందో నీకు తెలుస్తుంది. ఆ రోజున ఎందుకు పెట్టారయ్యా ఈ గోలంతా అంటే... ఆ నిద్ర ఏ స్థితి వల్ల ప్రాప్తిస్తుందో తెలుస్తుంది. ప్రతి రోజు నిద్ర పోతున్నావా లేదా? ఎక్కడి నుండి వస్తోంది నీకు నిద్ర? శరీరమా మనసా ప్రాణమా బుద్ధా? నిద్ర వస్తే పోవడమే కానీ నిద్ర ఎక్కడి నుంచి వస్తోంది అన్న ప్రశ్న వచ్చిందా నీకసలు? వచ్చిందా! ఎందుకని రాలేదు? అన్ని జంతువులు నిద్ర పోతున్నాయి, నువ్వు నిద్ర పోతున్నావు.

శి: జంతు లక్షణాలు పోలేదు.

గు: అవి పోలేదు. మనిషి అయ్యావు కానీ, మనిషి యొక్క బుద్ధికి ఉండాల్సినటువంటి సహజ లక్షణ మైనటువంటి అన్వేషణ పోలా. నిద్ర విషయములో ఎలా ఉన్నావు? మారలా జంతువుగానే ఉన్నావు అంతే. ఇందాక ఆహారం విషయం మాట్లాడుకున్నాము. ఇప్పుడు నిద్ర విషయం. నిద్ర ఎక్కడినుంచి

వస్తోందో నీకు తెలియాలయ్యా! ఎందుకు తెలియాలయ్యా అంటే నీ భ్రమాజనిత అజ్ఞాన మూలమంతా అందులో ఉంది. నీ భ్రమాజనిత అజ్ఞాన మూలమంతా ఈ నిద్రలో ఉన్నదట. అంటే ఎప్పుడైతే నీకు నిద్రను గమనించ గలిగేటటువంటి తెలివి వచ్చేస్తుందో, అప్పుడు నీ బుద్ధి ఏ స్థితిలో పనిచేస్తోంది? సూక్ష్మతమాన్ని పట్టుకోగలిగే శక్తిని పొందావు. అర్థమైందాండి! స్థూలం సూక్ష్మం, సూక్ష్మతరం, సూక్ష్మతమము.

శి: నిద్ర పోతూనే నిద్రని గమనించటమా!

గు: అట్లా లాభం లేదు. నిద్ర పోతూ నిద్రను గమనించ లేవు. నిద్ర ఏ స్థితినుంచి వస్తోందో ఆ సాధనతో కొనసాగుతూ ఉంటావండి! అర్థంమైందాండి! ఒక సాధన చెప్పాము కదా ఆ సాధన చేస్తూ నిద్రలోకి వెళ్తావు. అప్పుడు నీకు నిద్ర ఎంతసేపటికి నిన్ను ఆక్రమిస్తుందో నీకు తెలుస్తుంది. ఎక్కడ నుంచి ఆక్రమిస్తోందో నీకు తెలుస్తుంది. సాధన మీద దృష్టి పెట్టావండి! ఇప్పుడు రమ్మనండి నిద్రను వస్తుందా! రావటము లేదు కదా! అంతేనా కాదా! బుద్ధి సాధన మీద కేంద్రీకృతమై ఉన్నదండి. నిద్రను ఆక్రమించమనండి? కాబట్టి నిద్ర మూలం ఎందులో ఉంది?

బుద్ధి లోనే ఉంది. మనసులో లేదు, జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలలో అసలే లేదు. బుద్ధి ఎప్పుడైతే విశ్రాంతిని కోరిందో అంటే అలసట చెందితేనేగా విశ్రాంతి. ఈ అలసట ఎక్కడి నుంచి వచ్చిందట దానికి? నేను చేస్తున్నాను అనే కర్తృత్వ భావన చేత అలసట చెందింది. అర్థమైందాండి!

ఇప్పుడు మౌనంగా ఉంటే ఏమైంది? నేను మౌనంగా ఉన్నాను అనేది అక్కడ ఉందా, లేదుగా! కాబట్టి మౌనంగా ఎంతకాలం ఉండమన్నారు? 24గంటలు మౌనముగా ఉండు. ఏమైపోయింది అప్పుడు? కలతను చెందమనండి బుద్ధిని? అంటే బుద్ధికి అలసట సగము నువ్వు మాట్లాడటం వల్లనే వస్తున్నది. ఆ కర్తృత్వ భావమంతా నీ వాగ్రూపములో పనిచేస్తోంది. అర్థమైందాండి! పూర్వకాలం వాళ్ళు ఎక్కువ శాంతంగా ఉన్నారా ఈ కాలంలో వాళ్ళు ఎక్కువ శాంతంగా ఉన్నారా?

శి: పూర్వ కాలం వాళ్ళు.

గు: ఎందుకని? చూడండి ఆ ఒక్క సాధన చేస్తే ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో. అంతేనాండి! ఫలితము కూడా అలాగే ఉండేది. ఒక పని చేయడానికి సమయం

లేదని అనేవాళ్ళా ఎవరైనా! ఇప్పుడు మీరు ఏ పనైనా చెప్పండి. వెరీ బిజీ టైం లేదండీ బాబు. నీ టైం అంతా ఏది ఆక్రమించేసింది ఇప్పుడు? నువ్వు అక్కర లేని వన్నీ ఆక్రమించేసినాయి. అందువల్ల ఏమైపోయింది? నీ జీవితంలో ఏది వృధా అయిపోతోందో గుర్తించలేనటువంటి స్థితికి మారిపోయావు.

కాబట్టి నీ సాధనతో నిద్రకు ఉపక్రమిస్తే ఆ నిద్రా సమయమంతా ఏమైపోయిందిప్పుడు? సాధనగా మారిపోయింది. అర్థమైందా! మెలకువలో అప్పుడేస్థితిలో నిద్ర లేచావు? సాధనతోనే నిద్ర లేచావు. భోజనం సాధనే, నిద్ర సాధనే, మెలకువ సాధనే. ఇప్పుడు కల ప్రభావం? ఇంద్రియాలు విషయాలలో వర్తించినటువంటి వాటి యొక్క సూక్ష్మ ప్రతాపమే కల. సూక్ష్మ ప్రభావమే కల అంతేనా కాదా! లేకపోతే కల ఎక్కడ నుంచి వస్తుంది!

నీవు ఒకరితో తీవ్రంగా మెలకువలో వాదన పడ్డావండి? కలలో ఏమి వస్తుందండి? తీవ్రమైన లక్షణం నీలో ప్రతిబింబిస్తుంది. ప్రతిబింబిస్తుందా ప్రతిబింబించదా? ఎందుకని? కల అంటే మూడు గుణాలే, వేరే ఏమీలేదు. మూడు గుణాలే ఇక్కడ అన్ని చిత్రాలను సృష్టించినాయి. ఇక్కడ కూడా వాదన

పడుతున్నాడు. ఇక్కడ కూడా వేదన పడుతున్నాడు. కాబట్టి వాదనలన్నీ వేదన కొరకే. కాబట్టి జ్ఞాన యోగ సాధకుడు ఏమి చేయకూడదు? వాదించ కూడదు. ఎందుకని? వాదిస్తే తప్పనిసరిగా వేదన అనే ఫలితం ఉండక తప్పదు. కాబట్టి మీరందరూ ఏం వదులుకోవాలి? వాదించడం వదులుకోవాలి. వాదించడముతో పని లేదసలు. ఉంటున్నామా మనము అలాగా? ప్రతివారు ఎవరికి వాళ్ళు చూసుకోవాలి. నిత్య జీవితంలో దేంట్లోనైనా సరే మాట్లాడటముగా వాదించటం ఒక సమస్య. మానసికంగా వాదించటం ఇంకొక సమస్య. మనం మాట్లాడక పోవచ్చు కానీ, మనసులో మాత్రం వాదన జరుగుతోందా లేదా!

శి: జరుగుతోంది.

గు: జరుగుతోందా! మరి అది మూడుగుణాలలోకి లాక్కుని పోదా?

శి: వాదన అంటే బయట వ్యవహారాలు కాదు కదా మౌనములో

గు: ఏదైనా సరే

శి: ఈ ఆధ్యాత్మికముగానే ఏదో ఒకటి జరుగుతూ ఉంటుంది.

గు: ఏదైనా సరే, అంటే అర్థం ఏమిటి? వాక్కులో మనసు ప్రతిష్ఠితమై ఉన్నది. వాక్కు అంటే ఏమిటి? బయటకు మాట్లాడిందా! లేక లోపల మాట్లాడాలి అని తోచినటువంటి ప్రేరణా? ప్రేరణేగా వాక్కు అంటే, శబ్ధ మూలము ఎక్కడుంది? నీలోపలే ఉంది. ఆ ప్రేరణగా ఉన్న గుణ ప్రభావము చేతే కదా నువ్వు మాట్లాడుతున్నది. ఆ గుణ ప్రభావము మనసులో ఫలితాన్ని ఇచ్చేసిందా ఇవ్వలేదా? ఇచ్చేసింది. ఇచ్చేస్తే ఏమైంది అప్పుడు? కల, కలగానే ఉంది సాధనగా మారలేదు అప్పుడు.

శి: ఈ జరిగిన విషయాలన్నీ ఇలా కూర్చోగానే రిపీట్ అవుతాయి. మనము ఇట్లా మాట్లాడు కున్నవన్నీ అలాగే రిపీట్ అవుతూంటాయి కదా.

గు: రిపీట్ అయితే ఏమైనట్టు అక్కడ? చదవండమ్మా తర్వాత.

శి: ఇలా చెప్పకపోతే వైద్యుడే రోగ నిర్ధారణ చేసి చికిత్స జరపడానికి కొంత కాల వ్యవధి అవసరమై కాలము అనవసరముగా గడిచిపోయే ప్రమాదము ఉన్నది.

గు: అదీ విషయము, ఇప్పుడు మన అనుభవములో చూస్తూనే ఉన్నాము కదా! నోరు విప్పి మాట్లాడకపోతే గురువు గారికి ఏమీ తెలియదు. ఏం చెప్పాలో

ఆయనకు తెలియదు కాబట్టి ఆయనకు తోచింది చెపుతాడు. ఆయనకు తోచింది చెబితే అది నీకు సరిపోవచ్చు సరిపోక పోనూవచ్చు. అంతేనా కాదా! అప్పుడు కాలవ్యవధి నీకే నష్టం అయిపోతుంది. గురువు గారికి పోయేదేమి లేదు.

శి: ఇదే విధంగా జిజ్ఞాసువు అయిన శిష్యుడు గురువును సమీపించినప్పుడు తన సందేహాలను వీలైనంత స్పష్టముగా తెలియ చెప్పే ప్రయత్నం చెయ్యాలి. దీనిని వింటూనే శిష్యుడులో ఉండే మానసిక బుద్ధి పరమైన సమస్యలను, ఆధ్యాత్మిక అభివృద్ధిలో గల అవరోధాలను గ్రహించడానికి వీలవుతుంది.

గు: అదటండి సంగతి. నువ్వు చెప్పడం వల్ల ఎవరికి ఉపయోగం? నీకే ఉపయోగం ఏం తెలుసుకోగలుగుతారు దాని వల్ల నీ మనసులో, నీ బుద్ధిలో, నీ ఆధ్యాత్మిక ప్రయాణానికి అవరోధాలు ఏమున్నాయో తెలుసుకోగలుగుతారు. సమస్య ఏమిటో తెలుసుకుంటాడు. అవి ఎక్కడ ఉన్నాయట? సూక్ష్మతరము, సూక్ష్మతమము. ఈ సూక్ష్మతరము సూక్ష్మతమాన్ని తానే తెలుసుకోవాలని అనుకున్నావనుకో నువ్వు !

అప్పుడు ఏమైపోతుంది? సమయం వృథా అవుతుంది. కాబట్టి నీవు నీ గురించి స్పష్టముగా నీవు నీ ప్రశ్నలడగాలి.

శి: గురువుకు తదనుగుణముగా భోద చెయ్యడానికి వెంటనే వీలు కలుగుతుంది.

గు: ఏది ఉదాహరణగా తీసుకుని చెబితే ఏ సాధనోపాయాన్ని నీకు వివరిస్తే నువ్వు అందులోకి గట్టెక్కుతావో అతను వెంటనే ఒక నిర్ణయానికి రాగలుగుతాడు. అర్థమైందా! నువ్వు విన్నవి చదివినవి తెలుసుకున్నవి అనేక సాధనోపాయాలు నీవు తెలుసుకున్నవి నువ్వు ఉపయోగిస్తావుగా, పరిష్కారం రాలేదుగా, అప్పుడు అడుగుతాడు కదా నువ్వు ఏమి చేసావు? ఇదిగో నేను అలా చేశాను ఇలా చేశాను అని ఆ వివరం అంతా చెబుతావుగా! అదంతా విన్నాక ఏమి తెలిసింది ఆయనకు ఇప్పుడు? తన అనుభవ జ్ఞానాన్ని ఉపయోగించి ఓహో! ఇలా చేసినప్పుడు ఇదిగో ఈ దోషముతో చేశావు నువ్వు. ఈ దోషము లేకుండా నువ్వు చేసినట్లైతే నువ్వు దీంట్లోంచి బయటపడతావు అని ఉపాయము చెబుతాడు.

శి: ఇక్కడ ఈ అష్టావక్ర గీత జనక రాజర్షి ప్రశ్నలతో ప్రారంభమవుతున్నది. సాయం సంధ్యా సమయంలో మసక వెలుతురులో ఒక స్థాణువుని గాని, స్తంభాన్ని గాని, పాతిపెట్టిన కొయ్యను గాని చూసి భూతముగా భ్రమ పడే అవకాశం ఉంది. స్థాణువుని చూసి పొరబడటములో జనించిన భూతము, భయభ్రాంతుల్ని చేస్తుంది. అనేక సాధకబాధకాలకు ఆధారం అవుతుంది. ఆ పొరబడిన వానిని అధోగతి పాలు చేస్తుంది. ఉన్నది స్థాణువే అని గ్రహించకపోవడం అగ్రహణం చేతను, ఉన్న దానిని ఇంకొకలా భావించడం చేతను, ఇది అన్యదాగ్రహణము అవుతుంది. ఈ భూతము ఉనికి సాధ్యమవుతుంది. ఉన్నదేదో స్పష్టముగా తెలియని అజ్ఞానమే దీనికి కారణం.

గు: మీ అందరికీ చీకటి అంటే భయము ఉందా లేదా? ఉందా! ఏమని ఇచ్చాడు వాడు? నీ బాల్యములోనో, నీకు బుద్ధి వికాసము రాకముందో, అదుగో చీకటిలో ఫలానాది ఉంది అనే భయం నీలో స్థిరపడి వుంది. అది నీ తల్లి తండ్రుల ప్రభావము వలన కానీ, నీవు పెరిగిన వాతావరణం ప్రభావము వల్ల కానీ ఎవరో ఒకరు దానికి పూనుకోవడం వల్ల, అప్పుడు నీకు అంత వివేకం లేకపోవటం వల్ల, ఆ భ్రమాజన్య మైనటువంటి ఆ చీకట్లో, నీకు తెలియనటువంటి నీవు

నివర్తించడానికి వీలులేనటువంటి వస్తువో, భూతమో మరొకటో, ఆ చీకట్లో నీకు ఉన్నదని స్థిరపడేట్టు చేశాడు వాడు. ఎందుకని? నువ్వు గొడవ చేసినప్పుడల్లా, మాటిమాటికీ దాన్నే చూపెట్టాడు. ఇదిగో అక్కడున్నాడు ఆయనని పిలుస్తానుండు. ఆ తర్డ్ పార్టీని పిలిచేటప్పటికి ఏమైంది? దాని గురించి నీకు తెలియదు కదా! ఆ తెలియని తనమే నీకు భయాన్ని గురిచేసింది. ఇప్పుడు ఎదిగావండి. చీకట్లో ఏమీ లేదని ఇప్పుడు మనకు తెలుసా లేదా? అయినా రాత్రి 10:30, 11, 12 అయ్యింది వెళ్ళాలి ఒంటరిగా! వెళతారా ఎందుకని? చీకట్లో భయం. ఎందుకు భయం? అకారణము, దానికేమీ కారణం ఉండదు. కానీ లోపల మాత్రం కారణాలు ఉన్నాయి. బయటకు చెప్పవు కానీ లోపల ఉన్నాయన్నమాట. నీ ఒంటి మీద ఉన్న బంగారం ఎత్తుకు పోతాడనో, నిన్ను ఎత్తుకు పోతాడనో ఇలా ఏవో నీ లోపల నీ బాల్యములో అవి స్థిరపడేట్టు చెప్పారు నీకు. అర్థమైందాండి! నీవు రిస్కు తీసుకోకూడదనే ఉద్ధేశ్యంతోటి, నిన్ను ఒక రక్షణలో ఉంచాలనే ఉద్ధేశ్యం తోటి... ఏం చేసారు బాల్యంలోనే... ఏయ్ చీకటి బయటికి వెళ్ళమాక , అదిగో విలువైన వస్తువులు వేసుకున్నావు... బయటికి వెళ్ళమాక. ఇలాగా, నిన్ను ఒక భ్రమా జన్య

జ్ఞానానికి గురి అయ్యేటట్టు చేశారు. మరి ఇప్పుడు అక్కడ యదార్థ వస్తువు బుద్ధి గతి తప్పినదా లేదా! కారణం ఏమిటిట అగ్రహణం, అన్యదాగ్రహణం.

అగ్రహణం అంటే ఏమిటి?

ఉన్నది తెలుసుకోకపోవడం.

అన్యదా గ్రహణం అంటే ఏమిటి?

లేనిది ఉన్నది అనుకోవడం.

భ్రమ భ్రాంతి... ఒకటేమో లేనిది ఉన్నట్టు కనిపించడం.

రెండవదేమో...ఉన్నది లేకుండా చేయడం. కళ్ళ ఎదురుగుండా ఈశ్వరుడే ఉన్నాడు. కానీ కనపడటం లేదు. అదేమిటి బ్రాంతి. లేని జగత్తు, కానీ ఎలా కనబడుతోంది. ఉన్నట్టు కనపడుతుంది. అది భ్రమ.

రెండు ఒక దానిలోనే ఆవేశించినాయండి.

బుద్ధికి ఉన్నటువంటి ఈ దోష ప్రభావము చేత ఒకే కొయ్యమీద ఆవహించినాయి. ఉన్నది ఏమిటి? కొయ్య. అది కనబడటం లేదు. లేని భూతం కనబడుతోంది. ఉన్నది కొయ్య అని దానితో ఎందుకు పోల్చారు చెప్పండి... అది ఉపమానంగా స్తంభం అనో, కొయ్య అనో ఎందుకు తీసుకున్నాడు? ఉన్నది ఏమిటి ? స్తంభం, మార్పు చెందనది. ఉన్న ఈశ్వరుడు పరమాత్మ ఎలా ఉన్నాడు? చట్టు వలె, కూటస్థుడు వలె మార్పు చెందక ఉన్నాడు. అది కనపడటం లేదు.

లేని జగత్తు... దానిని దేనితో పోల్చాడు! భూతంతో పోల్చాడు. ఈ లేని జగత్తు కనబడుతోంది. అది ఎట్లా కనబడుతోంది ? భూతం వలె కనబడుతోంది. ఇక దానిని అలవి చేసుకోవడానికి వీలు కానంతగా నిన్ను భయపెడుతూ కనబడుతోంది. కాబట్టి ఈ జగద్రూపంలో ఉన్నదంతా కూడా, అదిగో ఆ భూతం వంటిది. ఈ జగత్తు ఉన్నదనేదేమో అన్యదాగ్రహణం. ఉన్న ఈశ్వరుడు కనబడకపోవడం అగ్రహణం.

ఉదా: - వివాహితమైన స్త్రీలు అందరూ కూడా మాంగల్యం ధరించక పోతే ఏమౌతుంది? వివాహం దేనికి జరిగింది? మనసుకి. వివాహ బంధం దేనిది... మనసుది. ఆత్మ కి ఏ బంధం లేదు. శరీరానికి ఏమి వేశావు... ఒక గుర్తు వేశావు. ఇప్పుడు ఈ గుర్తు తీసివేస్తే, వివాహ బంధం లేదా! అది సూక్ష్మము కదా! సంబంధం అక్కడ లేకుండా పోతుందా! పని చేస్తూనే ఉంటుంది కదా అది. మరి అలా నీవు ఒప్పుకోగలవా! ఒప్పుకో లేవు. ఎందుకు? శాస్త్ర వాసన. శాస్త్రం చెబుతోంది... వివాహమైన వారు అందరూ మాంగల్యం తప్పక ధరించాలి. అయితే మా ఆయన మెడలో వేస్తాను... ఆయనకి అయిందిగా వివాహం... అనకూడదా! నేను ఎందుకు చెబుతున్నాను అంటె... అభ్యాసం ఉంది. కానీ వివేకం లేదు. ఆ మాంగల్యం ఎందుకు నీకు పవిత్రం? ఎందుకు ధరించాలి? అవివేకం, కానీ రోజూ అభ్యాసం. తత్ఫలితాన్ని పొందడం లేదు. దాని కారణం వలన నీకు ఏ ఫలితం రావడం లేదు. ఎందుకని... భావంలో సుస్థిరమైనటువంటి జ్ఞానం కలగడమే దాని ఫలితం. ఆ జ్ఞాన ఫలితం రాలేదు... ఏం మిగిలిపోయింది చివరికి? మూడు సవర్లు పెట్టాడా ! ఏడు సవర్లు పెట్టాడా ! ఇది మిగిలింది. ఏమి ప్రయోజనం.

నేను గమనిస్తూ ఉంటానండి... వివాహానికి వెడితే... అమ్మాయి గారికి అత్తగారు ఏమి పెట్టింది?. మూడా, ఏడా, ముప్పైఏడా, ఏమిటి తేడా! ఈ వచ్చిన వారు అందరూ ఈ ప్రశ్న అడుగుతారు. వింతైన విషయం. వీరు వచ్చినది దేనికి అసలు... లక్ష్మీనారాయణులు, వచ్చినవారందరూ ఎవరండి?... లక్ష్మీనారాయణులు. ఆశీర్వచన శక్తి నీకు అప్పుడే ఉన్నది. ఆ దివ్యత్వము, ఆ దైవీ జ్ఞానముతో ఉన్నంతసేపే, నీకు ఆశీర్వదించగలిగే శక్తి ఉన్నది. ఉండవలసినదేమో దివ్య జ్ఞానముతో, ఉండడం ఏ జ్ఞానముతో... భ్రమాజన్యజ్ఞానం. ఉన్నదేమో చట్టు వలే, స్తంభమువలె కదలకుండా ఉన్నటువంటి కూటస్థుడు. ఆ దివ్య జ్ఞానము కనబడటం లేదు. లేని భూతం ఆవహించేసింది నిన్ను. అది ఏమిటి? భ్రమాజన్యజ్ఞానం.

కారణం... నీ బుద్ధిలో ఉన్న నిశ్చయజ్ఞానానికి అగ్రహణం, లేని భూతానికి సంబంధించినటువంటి అన్యదాగ్రహణం. ఈ రెండు దోషాల వలన ఇలా జరగుతోంది. దీనిని నిర్వర్తించడమే ఆత్మజ్ఞానం యొక్క ఉద్ధేశ్యం. ఆత్మజ్ఞానం వలన ఏమిటయ్యా నీకు ఉపయోగం... ఆ లేని భ్రమాజన్యజ్ఞానం లేకుండా పోవాలి. లేని మాయ లేకనే పోయెను. ఉన్న సద్వస్తువు... ఉన్నది ఉన్నట్టుగా తోచినది. ఏమీ కలపక్కర్లేదు, ఏమీ తీసివేయనక్కరలేదు. ఉన్నది ఉన్నట్టుగా

సద్వస్తువు దర్శనం కలిగింది. సద్వస్తువు జ్ఞానం కలిగింది. లేని మాయ లేకనే పోయినది. ఇదేనయ్యా ఆత్మ విచారణ వల్ల నీకు కలిగినది. అలా కలగడం వలన నాకు ఏమిటి ప్రయోజనం? ఇలా కలిగి కనుక నీవు స్థిరముగా ఉంటే... ఆ లేని మాయ నుండి నీవు ముక్తుడవయ్యావు కదా! లేని మాయని, ఉన్నదనే భ్రాంతి చేత బాధించబడుతున్నావు. ఏ జ్ఞానం కలిగితే, లేనిది లేకనే పోయినదో... తత్ఫలితం చేత నీకు ముక్తి లభించినది.

శి : ఉన్నదేదో స్పష్టంగా తెలియని అజ్ఞానమే దీనికి కారణం.

గు : అది సంగతి. భగవంతుడి గురించి మనకి చూచాయగా తెలుసా! స్పష్టంగా తెలుసా!

శి : స్పష్టంగా తెలియదు.

గు : స్పష్టంగా తెలిస్తే... అంటే వస్తు నిశ్చయ జ్ఞానము కనుక స్పష్టముగా ఉంటె... ఒకటి చూసి మరొకటి అనుకోవలసిన అగత్యం లేదు. ఇప్పుడు మనము ఎంతసేపు దేనిని పెంపొందింప చేయాలట... వస్తు నిశ్చయ జ్ఞానాన్ని పెంపొందిస్తూ పో,

తత్వ దర్శనం దృష్టితో చూస్తూ పో, లేనిదీ లేకనే పోతుంది. అంతేకానీ, దానిని లేకుండా చేయడానికి లేనిపోని పనులన్నీ చేయమాకా! ఆ మంత్రం వేస్తా ఈ మంత్రం వేస్తా, ఈ తంత్రం వేస్తా... అట్లాంటి జోలికి పోమాక. అది లేనిది ఇంకా పెంచేస్తుంది. భ్రమాజన్య జ్ఞానాన్ని పెంపుదల చేస్తుంది.కాబట్టి ఏమి చెయ్యాలట... ఒక గ్లాసులో రంగునీళ్ళు ఉన్నాయండి... రంగు నీళ్ళు గ్లాసు పగలగొట్టకుండా మార్చాలి. ఎలాగా! మంచినీళ్ళ పోస్తా పో... రంగు నీళ్ళు పొర్లి పోయినవి. పోగా పోగా ఏమి మిగిలింది. మంచినీళ్ళే మిగిలిపోయినవి. కాబట్టి తత్వదర్శన దృష్టితో, తత్వ జ్ఞాన దృష్టితో జీవిస్తూ పో, ఆత్మ జ్ఞాన దృష్టితో జీవిస్తూ పో... ఏమైంది? అదే సత్యమైంది? లేని మాయ లేకనే పోయినది. నువ్వు ఏమీ చేయనక్కరలేదు. దానిని పంపించడానికి నీవు ఏమి కష్టపడక్కర్లేదు.ఇప్పుడు మనము అందరమూ వదిలేయవలసిన వాటి గురించి ఆలోచించాలా! పొందవలసిన వాటి గురించి ఆలోచించాలా! వస్తునిశ్చయ జ్ఞానాన్ని పెంపొందించుకో. వదల వలసినవి అవే నిన్ను వదిలి వేస్తాయి. ఎలాగా! ఈ సత్యము చెప్పండి...

నీ బాల్యము నిన్ను ఎట్లా వదిలివేసింది? నీవు వదిలేయాలని వదిలివేస్తే వదిలేసిందా! పొందవలసిన దానిని దృష్టిలో పెట్టుకుని ముందుకు ప్రయాణం చేసావండి. ఏమైంది? నీ బాల్యం నీ వెనకాలే జారిపోయింది. ఎప్పుడు జారి పోయిందో చెప్పాపెట్టకుండా జారిపోయింది. అట్లాగే యవ్వనం, అట్లాగే కౌమారం,ఇప్పుడు వృద్ధాప్యం... ఇదీ వదిలేయదా నిన్ను... వదిలేస్తుంది. దీని తర్వాతది పొందాలనే లక్ష్యంతో ముందుకు సాగుతూ ఉంటే, నీవు వదిలేసేవన్నీ నీ వెనుక వదిలేస్తూనే ఉన్నావు.

కాబట్టి సృష్టిలో సహజ ధర్మం ఏమిటట...  నీవు పొందవలసిన దానిని పట్టుకో, వదిలేయ వలసినది అదే వదిలేస్తుంది. కానీ మనము ఏమి చేస్తాము సాధనలో... ఏదీ వదలాలనుకున్నావో వాటిని స్మరిస్తున్నావు. స్మరించే కొద్దీ ఏమైపోయింది... అవే నిలబడి పోయినవి. నీవు అభ్యాసం చేయడం ద్వారా, దేనిని పొందాలనుకున్నావో దానిని అభ్యాసం చేస్తే అది పొందావు. ఏవి

వదిలేయాలనుకున్నావో  వాటినే స్మరిస్తున్నావు.  ఏమైపోయిందప్పుడు... అవే పొందుతున్నావు.

కాబట్టి స్మరణలో అయినా సరే వాటిని గుర్తించ రాదు. నీకు విమర్శించే లక్షణం ఉందనుకోండి... ప్రతి ఒక్కరికీ ఉంటుంది కదా మానవుడికి. ఎవరైనా కనబడగానే, వాడిలో ఉన్న మంచి గుణాలు కనపడతాయా! ఉన్న ఒక్క చెడ్డ గుణం కనపడుతుందా! ఎందుకని... 99 మంచి గుణాలు లేవా వాడిలో... ప్రతి మానవుడిలో 99 మంచి గుణాలే ఉంటాయండి... ఒక్క శాతమే చెడు ఉంటుంది. అప్పుడే మానవుడు అవుతాడు. అంతకంటే ఎక్కువ ఉంటే మానవుడు అవ్వడు. ఇంకా కింద జంతువులలోనే ఉంటాడు. కానీ నీకు ప్రతి మనిషి కనబడగానే ఏది స్ఫురిస్తోంది... ఆ ఒక్క శాతము కనబడుతుంది. మిగిలిన 99% కనబడదే! నీవు 99 శాతం గుర్తించే ప్రయత్నం చేయి.  అప్పుడు ఈ ఒక్క శాతం కనబడదు. నీవు ఒక్క శాతం చూడకూడదని దృష్టి ఒక్క శాతం మీదే పెట్టావు... ఏమైంది? అదే కనబడుతుంది.

బాబా గారి దగ్గరికి పూజ చేయడానికి వెళ్ళామండి. ఏం కనపడింది? అందరూ గుడిలో పూజ చేయడానికి వెళ్తున్నారా లేదా! భగవద్దర్శన కాంక్షతో వెళ్ళావు. భగవంతుడిని దర్శించాలనే కాంక్షతో... దృష్టి దేనిమీద పడింది. అలంకారంమీద పడింది. ఎందుకని... రోజు అలంకారం చేసుకోవాలనే అపేక్ష నీకు ఉండబట్టి, అదే అపేక్ష గుడికి వెళ్ళినా కూడా నిన్ను విడిచి పెట్టలేదు. నీవు అద్దము ముందు నిలబడి, బాగా అలంకరించుకుని, ఆహా నేను బాగున్నాను అని అనుకోవడం రోజూ అభ్యాసం చేశావు. ఈ అభ్యాస ఫలితం ఎక్కడ కనబడుతోందట. ఇక్కడ కనపడలేదు. ఎక్కడ దర్శనం అయిందట ఇప్పుడు... బాబా దగ్గరికి వెళ్ళేటప్పటికి, అక్కడ కూడా అదే దోష దర్శనం ఎదురైంది. తప్పు తనలో ఉందనుకోడు.

అమ్మవారికి, బాబా వారికి సరిగా కట్టలేదు. ఏమిటీ కట్టేది, అర్థముందా ఏమన్నా! అన్నామనుకోండి... ఏమయ్యా ఏం మాట్లాడుతున్నావు నువ్వు... ఇంకో గుణం మారిపోయింది. దోష దర్శనం చేసినప్పుడు రజోగుణంలో ఉన్నావు, విచారణ

చేస్తే పోవలసినదిపోయి ఏమైందిపుడు, తమోగుణం... ఇంకో గుణం దిగింది. కాబట్టి, దోషదర్శనమే చేయమాక, ఏమైందప్పుడు... సమస్య ఏముంది అక్కడ... నీవు పొందవలసిన దానిని స్మరించవయ్యా! వదలవలిసిన దాని గురించి నీకు ఎందుకు? అది నా బాధ... అంటున్నాడు ఈశ్వరుడు.

నీవు దేనిలో నుంచి ముక్తుడవు అవ్వాలో... దాని సంగతి నీకెందుకు? పొందవలసిన ఈశ్వరుడిని స్మరించు, పొందవలసిన గురువుని స్మరించు, గురు వాక్యాన్ని స్మరించు, ఏమైంది అప్పుడు... వదల వలసినవి అవే వదిలిపెట్టినవి. మంచి నీళ్ళు పోస్తూ పో, రంగునీళ్ళు అవే పోయినవి. కాబట్టి మీరు నిజజీవితంలో, ఏ సాధనైనా చేయండి, ఏ విచారణైనా చేయండి, వదలవలసిన వాటిని ఎప్పుడూ స్ఫురణకి తెచ్చుకోకూడదు. ఏ రకమైనటువంటి ఆకర్షణ బలమైన ఉండనివ్వండి... ఆ ఆకర్షణ బలము పనిచేస్తోంది అనగానే, నీకు ఏమి గుర్తుకు రావాలి... దానికి వ్యతిరేకముగా ఆత్మజ్ఞాన పరిధిలో, నీవు పొందవలసినది ఏదో గుర్తుకు రావాలి. కానీ మనకి ఏమి గుర్తొస్తుంది? రివర్స్...

అది ఎట్లా వదలాలి, అది ఎట్లా అ ఎట్లా అన్నదే గుర్తుండిపోతుంది. ఏమైందప్పుడు? అదే గుర్తుండిపోతుంది.

వదల వలసినది నిన్ను వదిలిపెట్టాలని ఈశ్వరాజ్ఞ అయినా కూడా నిన్ను విడిచి పెట్టదు. అందుకనే భగవంతుడిని ఆశ్రయిద్ధామని వెళ్ళినా, అడవికి పోయినా నీ సంసారము నీతోనే వచ్చింది. ఎందుకు? నీవు స్మరిస్తున్నావు కాబట్టి. స్మరించినంత కాలము అది నీతోనే ఉంటుంది. స్మరించకుండా విడిచిపెట్టు. ఏమైపోయింది? ఏమీ లేదే, ఏమీ చేయలేదు.దానంతట అది ఎప్పుడూ రాదు. ఈ వేదాంత వాక్యాలలో, ఈ ఆత్మజ్ఞానానికి సంబంధించిన, తద్ వ్యతిరేక మైనటువంటి అనుభవ జ్ఞాన వాక్యాలని దాని ఎదురుగుండా పెట్టాలి.

శి : టైముకి స్ఫురణకు రావడం లేదు కదండీ?

గు : అంటే నీవు ఏమి మననం చేస్తున్నావు? దాని బదులు ఇది మననం చేయి. గురు వాక్యాన్ని మననం చేయి. అనుభవజ్ఞాన వాక్యాలను మననం చేయి.

నిరంతరాయంగా చేస్తున్న సత్సంగములో  మాట్లాడుతున్న వాక్యాలను మననం చెయ్యి. ఏమైపోయిందప్పుడు?

ఉదా :  మీరు మీ ఇంటికి వెళ్ళారిప్పుడు... ఒక  వారం తర్వాత వెళ్ళారు అనుకుందాము. వెళ్ళగానే ఇల్లంతా అస్తవ్యస్తంగా కనబడింది మీకు. మీకు ఎలా కనబడింది?  ఒక తీరుగా కనబడుతుందా! ఉండదుగా! ఇంట్లో ఉన్న వాళ్ళకి అది సమంజసంగానే కనబడుతోందా లేదా! అరె.. నాకిది ఉపయోగం, నేను ఇక్కడ పెట్టుకున్నాను. నీవు వచ్చి ఏమన్నావు?  ఇది ఏమిటి ఇక్కడ పెట్టావు? అక్కడ పెట్టవలసినది? ఇక్కడ నుంచి లేచి వెళ్ళి మాటిమాటికీ అక్కడినుంచి ఎవరు తెచ్చుకుంటారు...  ఇక్కడ అందుబాటులో ఉంది ఇక్కడ పెట్టుకున్నాము. ఇప్పుడు ఏమి ప్రమాదం వచ్చింది? ఇల్లు అంటే ఇక్కడ ఉంటుందా ఈ వస్తువు?  అక్కడే ఉండాలని ఏమైనా ఉన్నదా! ఆలోచించండి... నిన్ను బట్టి ఇల్లు ఉండాలా!  ఇల్లును బట్టి నీవు ఉండాలా!

పెద్దావిడ... మాటిమాటికి లేచి మంచినీళ్లు తెచ్చుకోలేదు. ఏం చేస్తుంది? అక్కడే పెట్టుకుంటుంది, దాని పక్కన మందు, మళ్ళీ లేచి వెళ్ళి తెచ్చుకోలేదు, ఇంకొకరికి చెప్పలేదు. ఏమిటి, ఎక్కడబడితే అక్కడ ఇవన్నీ పెట్టావు అంటే... నీకు కూడా ఆ వయసు వస్తే, అప్పుడు తెలుస్తుంది. ఆవిడకి మూలగడానికైనా శక్తి ఉంది. నీకు మూలగ డానికి కూడా శక్తి ఉండదు. ఎందుకని ఒకరికి అస్తవ్యస్తంగా కనబడినది, ఒకరికి సక్రమంగా కనబడుతోంది అంటే... ఈ దోష దర్శన ప్రభావం చేత, నీమనసులో అలా గీసేసుకున్నావు. అది అలాగే ఉండాలి. ఇది ఇలాగే ఉండాలి. భూమి ఇట్లాగే కదలాలని ఒకరు శాసిస్తే తిరుగుతోందా! మరి నీవు ఎందుకు అలా అనుకుంటున్నావు? ఇది బుద్ధిలో ఉన్నటువంటి దోషం. అగ్రహణం, అన్యదాగ్రహణం. ఉన్న వస్తు నిశ్చయ జ్ఞానాన్ని గుర్తించలేకపోవడం అన్యదాగ్రహణం, లేని భూతాన్ని, భ్రమా జనిత జ్ఞానాన్ని స్మరించడం. నీస్మరణ ప్రభావంచేత భూతం కనబడుతోంది అక్కడ. నీవు స్మరించకపోతే ఉన్నదా అక్కడ అది, లేనే లేదు. ఈ జగత్తుని నీవు గుర్తించనే గుర్తించలేదు. ఉందా ఎప్పుడైనా అది? ఏం చేసింది అది, ఈ ప్రపంచములో నీవు తప్ప ఇంక వాడికి ఏమి పని లేదా! ఎవరికైనా అసలు నీతో పని ఉందా! ఈ సృష్టిలో నీకు నీ గురించి తప్ప,

మరొకరికి అసలు నీ గురించి ఏమైనా పని ఉందా! పని లేదు. నిమిష నిమిషానికి నీవు ఎవరిని గుర్తుతెచ్చుకుంటున్నావు? వాళ్ళందరూ ఏమనుకుంటారు? ఎవరు వాళ్ళు? ఎక్కడి వాళ్ళు? అన్యదాగ్రహణం. లేని భూతాన్ని స్మరించావు. ఎవడో ఎక్కడో చేస్తే, ఎవడికో తెలిస్తే, వాడు ఇంకొకడికి చెబితే పేరు ప్రతిష్ట డ్యామేజ్ అయిపోయినవి. అంతేనా! అర్థముందా ఏమైనా! ఆలోచించండి. ఈ రకంగా లేని భూతాలను మనము ఎన్నింటిని స్మరిస్తున్నాము... ఇవి అన్ని ఏమిటి? అన్యదా గ్రహణం.

మరి ప్రయత్న బలమంతా జీవితమంతా, అన్యదా గ్రహణంతో కూడుకుని ఉంటే, యదార్థ వస్తువు, ఎదురుగుండా ఉన్న పరమాత్మ కనబడుతున్నాడా! మరి, కనబడడం లేదు. కాబట్టి ఏమి చేయాలి... వస్తువునిశ్చయ జ్ఞానాన్ని పెంపొందించుకో. ఈ వదిలేసేది అదే నిన్ను వదిలేస్తుంది. ఆ వదిలేయ వలసినది తోచినప్పుడల్లా ఎవరిని గుర్తు తెచ్చుకోవాలి. వస్తునిశ్చజ్ఞానము, ఆత్మజ్ఞానము, స్వరూప జ్ఞానము, పరమాత్మజ్ఞానము, బ్రహ్మవిద్య ని గుర్తు తెచ్చుకోవాలి. దీనిని స్మరిస్తూ పో, దీనిని అభ్యాసం చేస్తూ పో, ఈ వివేకాన్ని ఉపయోగించు. ఏమైనది

అప్పుడు... ఆ భ్రమాజనిత జ్ఞానములో వివేకము లేదు. అభ్యాసం ఒకటే ఉన్నది. అభ్యాసము వలన అడ్డం వచ్చినట్లుగా కనబడుతోంది.

ఎప్పుడైతే ఈ బ్రహ్మవిద్యకు సంబంధించిన వివేకాన్ని ఉపయోగించేవో... ఈ వివేక ప్రభావం వలన ఏమైపోయింది? మెరుగుపడితే ఆ అభ్యాసం కూడా మెరుగుపడింది. ఆ రాయిని కూడా బాగా సానబెట్టి మెరుగుపెడితే, అది కూడా వజ్రం వలె ప్రకాశించింది. ప్రకాశించ లేదు, పనికి రాదని అదే వదిలేసింది. ఏమి నష్టం వచ్చినది. ఏమీ నష్టం రాలేదు కదా! చేయవలసిన కర్తవ్యమే, అగత్యమే ఉన్నదండి. మెరుగైన పద్ధతిలో ఉత్తమమైన ఆదర్శంతో, నీకు బంధ హేతువు కాని పద్ధతిలో నిర్వహించావు.

అథవా! అది అనవసరం, ఏం చేశావు? నీ వివేకాన్ని ఉపయోగించావు. మొదటే వదిలేసావు. ఇప్పుడు కర్తవ్యం తగ్గిపోతోందా! పెరిగిపోతోందా! తగ్గి పోవడంలా! ఎప్పుడు? ఆత్మ వస్తువును దృష్టిలో పెట్టుకుని, బ్రహ్మజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని విచారణ చేశావు. మనం నిరంతరాయంగా కర్తవ్యాన్ని బాధ్యతలని,

పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నామా! తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నామా! ఎందుకు... అన్యదా గ్రహణం.

రోజు మా మనవరాలు నన్ను పలకరిస్తే, ఆనందం. అర్ధము లేని ఆనందం. ఆ జీవి తాను స్వయంగా జన్మించింది. తాను స్వయంగా పరిణమిస్తోంది. తాను స్వయంగా జ్ఞానాన్ని పొందుతోంది. మధ్యలో మనవరాలు గొడవ ఏమిటి? అది అన్యధాగ్రహణం. లేని భూతాన్ని ఆవహింప చేశావు. అమ్మమ్మ అనే భూతము ఆవహించింది. ఏమైందప్పుడు? ఈవేళ కనపడలేదే! నిన్న కనపడలేదే! మూడవరోజు కనబడింది. ఏమ్మా! మీఅమ్మ నాకు కనపడ వద్దని చెప్పిందా! చూడండి... ఎక్కడికి పోయిందిప్పుడు? ఈ పిల్లకి ఏమైనా తెలుసా! ఏం చేస్తుంది? ఆవిడ పైన ఉన్న ఆవిడకి ఆరా! ఏమిటి ఐదు నిమిషాలు లేటుగా వచ్చావు? అమ్మమ్మ మధ్యలో పలకరించింది. ఆహా! ఏమంది ఏమిటి? నువ్వు రావద్దన్నావా అని నన్ను అడిగింది? డైరెక్టుగా అప్పజెప్పేస్తుంది. ఆహా! అలాగందా! ఇప్పుడు ఏమైంది? చూడండి ఎంతటి అన్యదాగ్రహణమో! విచారణ చేసి చూడండి...

మానవ జీవితం ఎంత వృధా అయిపోతోందో... భగవంతుడు ఇచ్చినటువంటి కాలాన్ని అంతా కూడా, ఇటువంటి నిరర్ధకమైనటువంటి పనులు, నిష్ప్రయోజనమైనటువంటి పనులు, దాని వలన ఏమి ప్రయోజనం లేదు. లేకపోగా అనేకజన్మల కృంగ తీసుకుపోతోంది, లాక్కుపోతోంది. ఎంతగా బలపడిపోయింది అంటే... నీవు వదల లేనంతగా బలపడి పోయింది. సాక్షాత్తు ఈశ్వరుడే పూనుకున్నా కూడా నిన్ను విడిపించ లేక పోతున్నాడు. ఎవరూ చేయలేరు సహాయం. సాక్షాత్తు ఈశ్వరుడే పూనుకున్నా విడివడకపోతే ఎవరు ఏం చేస్తారు? అంతగా వివేక శూన్యతతో అభ్యాసము చేస్తున్నావు.

ఏమిటి? ఆ వివేక శూన్యత... ఎందుకు దేహాన్ని ధరించావో మరచిపోవడం, నీ స్వధర్మాన్ని మర్చిపోయావు. నీ స్వధర్మము ఏమిటి? స్వరూప జ్ఞానాన్ని తెలుసుకోవడమే శరీరాన్ని ధరించావు. అదే నీ స్వధర్మము. ఆ ప్రాథమిక ధర్మాన్ని విడిచి పెట్టావు. నేను ఆత్మస్వరూపుడననే జ్ఞానాన్ని తెలుసుకోవడం అనే సత్యాన్ని మరిచావు. ఈ అన్వేషణను వదిలేసావు. ఈ సాధనని వదిలేసావు. అన్యదా గ్రహణం, లేనిదానిని చూడడం మొదలు పెట్టావు. ఉన్న దానిని అగ్రహణం. ఈ రెండింటి వల్లనే మానవ జీవితం అంతా అస్తవ్యస్తమైపోయింది. క్రమశిక్షణ

పేరుమీద నీవు పెట్టుకున్నవన్నీ ఏమిటి? నిజంగా క్రమశిక్షణేనా! నాకు అనిపిస్తూ ఉంటుంది... తల్లిదండ్రులు, పిల్లల్ని పెట్టే ఆ క్రమశిక్షణ అంతా! నిజంగా క్రమశిక్షణేనా! ఆ పేరు మీద మీరు ఎన్ని అత్యాచారాలు చేయడం లేదు! ఎందుకని ఆ మాట వాడుతున్నాను అంటే... వాడికి నిజంగా ఏ భూతము తెలియదండి, పిల్ల వాడికి తెలుసా! వాడికి ఏ కల్మషం లేదండి, మాలిన్యం లేదండి, వాడికి మాలిన్యం ఎవరి దగ్గర నుండి అబ్బింది... మన వల్లనే, మన దురభ్యాసాలన్నీ వాడికి అప్పజెప్పడం వలన, వాడికి నిజమైన ఆచార సాంప్రదాయం మరుగైపోగా, అనవసరమైనవన్ని తగులుకున్నాయి. నీవు చెడిపోయింది కాక, మొత్తం ఆచారం పేరుమీద అందరినీ చెడగొట్టావు. ఎందుకు? అభ్యాసం అంతే. వివేకం లేనటువంటి అభ్యాసం, కాబట్టి, ఎప్పుడైనా సరే... నీలో ఈ స్ఫురణ, మనో బుద్ధులలో కదలిక రాగానే నీకు స్ఫురించవలసినది ఏమిటి? నేను ఆత్మజ్ఞానం దిశగా వీటిని ఉపయోగిస్తున్నానా! భ్రమాజనిత జ్ఞానముగా ఉపయోగిస్తున్నానా! ఉన్న పరమాత్మ వస్తువుని గుర్తించడానికి వీటిని ఉపయోగ పెడుతున్నానా! లేని భూతాన్ని చూడడానికి ఉపయోగిస్తున్నానా! నువ్వు ఎట్లా ఉపయోగిస్తే అవే

కనబడతాయి. వాటి దోషం ఏమీ లేదు. ఇంద్రియాల దోషము ఏమీ లేదు. అని అంత స్పష్టంగా నిర్వచిస్తున్నారు.

శి : జ్ఞానము అనే వెలుగును సంపాదిస్తే అజ్ఞానాంధకారం పటాపంచలవుతుంది.

గు : చీకటిని నెట్టేయాలని ప్రయత్నిస్తే ఎక్కడికి నెట్టేస్తావు? ఈ జగత్భావనను పోగొట్టడం కూడా ఆ చీకటిని నెట్టేయడం వంటిదే. ఎప్పటికైనా అవుతుందా! ఏమి చేయవచ్చట... ఆ గొడవంతా నీకు ఎందుకయ్యా! స్వరూపజ్ఞానాన్ని ఆశ్రయించు. చీకటి అదే పోతుంది. అజ్ఞానాన్ని తొలగించే ప్రయత్నం చేయమాకా! జ్ఞానాన్ని పొందే ప్రయత్నం చేయి. మనము ఏమి ప్రయత్నం చేస్తూ ఉంటామండి, అజ్ఞానాన్ని తొలగించే ప్రయత్నం, అంటే చీకటిని నెట్టేసే ప్రయత్నం చేస్తున్నావు. అది ఎప్పటికీ పూర్తి అవ్వదు. ఏం చేయాలి అసలు నీవు... నీ కర్తవ్యం ఏమై ఉన్నదట... జ్ఞానాన్ని పొందే ప్రయత్నం చేయి, ఆ ప్రయత్నబలం ఏదో, జ్ఞానాన్ని పొందడానికి ప్రయత్నించు. అప్పుడు ఏమైంది? చీకటి దానంతట అదే పోయింది.

శి : ఉన్నదేదో నిశ్చయముగా తెలిసినప్పుడు భ్రమపడటం జరగదు.

గు : అదీ సంగతి. ఇప్పటిదాకా అదేగా మాట్లాడుకున్నాము. ఉన్నది నిశ్చయముగా తెలిస్తే భ్రమ లేదు బాధ లేదు. మీ అమ్మాయికి పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించేటప్పుడు ఏడ్చావా లేదా! ఎందుకు ఏడ్చావు? తెలియదు. అజ్ఞానం. ఏడవ వలసిన అగత్యం ఉన్నదా! కానీ ప్రతి ఒక్కరూ ఏడుస్తున్నారా లేదా! ఎందుకట... అధవా ఒకవేళ ఎవరైనా ఏడవలేదు అనుకోండి... ఆ రోజు హాట్ టాపిక్ ఎవరు? ఏడవని వాడే. వాడికి అంతో ఇంతో జ్ఞానం వల్ల వాడు దుఃఖించలేదు. ఇదే విషయం... మా అమ్మగారు చనిపోయారు. నేను దుఃఖించ లేదు. కారణం ఏమిటంటే... అప్పటికే నాకు ముక్తానుభవం ఉన్నది కాబట్టి, కళ్ళ ముందు చూశాను, ఆ జీవి శరీరాన్ని ఎట్లా విడిచి పెడుతూందో, ఓహో! శాస్త్రములో చెప్పినది ఇక్కడ అనుభవ జ్ఞానముగా కళ్ళ ఎదురుగుండా కనబడుతోంది. సత్యమే తోచింది. ఓహో, ఈ జీవి ఈ శరీరాన్ని విడిచిపెట్టి, మరో శరీరాన్ని ఆశ్రయించింది. అమ్మ అయినా, అమ్మమ్మ అయినా నువ్వు ఆరోపించినదేగా! అక్కడ ఉందా, అది ఏమైనా? అక్కడ ఏమీ లేదుగా! నువ్వు ఆరోపించినది. అందులో సహజమా అది. కాదు కదా! మరి ఎందుకు నాకు దుఃఖం కలగాలి. అది అసహజం కదా! దుఃఖం కలగడం అసహజం. ఎందుకని... నువ్వు

అసహజత్వమైనటువంటి అమ్మని అమ్మమ్మని ఆరోపించావు. ఈ ఆరోపించిన భూతం సత్యం అనుకునేటప్పటికి, నీకు దుఃఖం కలిగింది. అది తీసేసామండి... ఏమైందిపుడు? ఓహో! ఈ జీవశరీరంతో అందులో ఉన్న జీవికి ప్రయత్నపూర్వక ఫలితం అయిపోయింది. కాబట్టి, ఏంచేసాడు? శరీరాన్ని విడిచాడు. అంతేకదా! ఏంచేస్తావు? తీరకపోతే ఇంకొక శరీరాన్ని ఆశ్రయిస్తావు. తీరితే ముక్తుడవు అవుతావు. రెండే మార్గాలు. వేరే మార్గం లేదు.

పదార్థం, పదార్థంలో కలిసి పోయింది. శక్తి, శక్తి లో కలిసి పోయింది. శరీరం రాదు ఇక. అలా కలిసే అవకాశం లేకుండా జీవించావు... ఏంచేయాలప్పుడు, మరల మరొక ఆశ్రయం. ఇంతకు మించి వేరే ఏమీ లేదు. ఇప్పుడు ఈ సత్యం తెలిసిన తర్వాత దేనికి దుఃఖించాలి? అందరికీ హాట్ టాపిక్ ఎవరు ఇప్పుడు? పెద్ద పిల్లవాడు, కర్త... కర్మకాండకి ఎవరు కర్త, పెద్దవాడు. ఎక్కడ కంటి వెంబడి ఒక చుక్క నీరు రాలేదు. ఎందుకని మరి... ఇంకా ఎవరిని దుఃఖింప చేయనీయలేదు. కారణం ఏమిటి? తనతో ఉన్న వారందరితో ఏం చెప్తావు? దుఃఖించేవారికి ఏమి చెబుతావు? ఎందుకు దుఃఖిస్తున్నావు? అని ప్రశ్న వేశావు అనుకోండి... పైకి కిందకి ఎగాదిగా చూస్తాడు. ఎందుకు దుఃఖిస్తున్నావు? ఇప్పుడు ఎవరికోసం

దుఃఖిస్తున్నావు? అని అడిగామనుకోండి... ఏం చెబుతాడు? మా అమ్మ పోయింది. అమ్మ పోవడం ఏమిటి? ఆలోచించు ఒకసారి... శరీరం అంటావా! నీ ఎదురుగుండానే ఉంది. అమ్మ అని దేనిని అంటున్నావు? శరీరాన్నేనా! అది ఎదురుగుండానే ఉంది. అది ఎక్కడికి పోయింది? అది ఎక్కడికీ పోలేదు.

కాదు, శరీరంలో ఉన్న ప్రాణాన్ని అమ్మ అంటావా ! దానికి ఆ భావం లేదు. ఉందా! లేదు. పోనీ, మనస్సుని బుద్ధిని అందామా! అవి ఎప్పుడు అలా లేవుగా! అమ్మగా, అమ్మమ్మగా ఉన్నాయా మనోబుద్ధులు... లేవే! నువ్వు కనబడితే అమ్మ , మరొకరు కనబడితే అమ్మమ్మ, మరొకరు కనబడితే మరొక బంధం. ఒకరికి మరదలు, ఒకరికి చెల్లెలు, ఒకరికి మరొకరు. మరి ఇప్పుడు ఇది ఏమిటి? కాదే. మరిప్పుడు దేనికోసం ఏడుస్తున్నావు? శరీరం కోసమా, ప్రాణం కోసమా, మనసు కోసమా, బుద్ధి కోసమా! ఇప్పుడు నీ దుఃఖం ఏమైనది? ఆగిపోయినదా! ఆగిపోలేదా! ఎందుకని? కొరుకుడు పడని సమస్య వచ్చింది ఇపుడు.ఎందుకోసం ఏడవాలి అనే సమస్య వచ్చింది. ఇది తేల్చుకోగలవా! అప్పుడు ఏడ్వాలా! ఈ సమస్యను తేల్చాలా! అపుడు ముందు ఏమి చేస్తావు? ముందు వీడి గోల వదిలించుకోవాలి అంటే, నేను ఏడవడం ఆపాలి. అంతేనా కాదా! చాలామంది చనిపోయినపుడు భగవద్గీత

పెడుతూ ఉంటారు. ఎందుకని... భగవద్గీత పెడితే, ఎవరో ఒకరు చనిపోయారని గుర్తన్నమాట.

ఉదా : నేను ఎప్పుడైనా రాత్రిపూట ఏం చేస్తానంటే... సెల్ ఫోన్ లో భగవద్గీత ఉంటుంది, పెడతాను నిద్రపోయేటప్పుడు, అలా వింటూ కొంతసేపు అయ్యేటప్పటికి వదిలేస్తాము. మా శ్రీమతి గారు ఏమంటారు... ఆ భగవద్గీత తీయండి ముందు. ఎందుకు నీకు ఏమి సమస్య వచ్చింది భగవద్గీత తోటి, ఆ భగవద్గీత వింటే, ఏమి గుర్తుకు వచ్చినదట... ఇదీ బ్రమాజన్యజ్ఞానం అంటె. వాస్తవిక జ్ఞానం పని నీకు పనిచేయడం లేదు. లేని భూతం పని చేస్తోంది. ఎందుకు, ఇన్ని ఉదాహరణలు చెబుతున్నాను అంటె, మీ నిజ జీవితంలో మీరు జీవించేటప్పుడు ఓహో! ఎలా తప్పుదారిలో పడుతున్నాము! ఏది సరియైన దారి? స్పష్టమైనటువంటి నిర్ణయము నిర్వచనము ఉండాలి. ఎప్పుడైతే అలా స్థిరంగా ఉంటావో... అది నిన్ను ఏమీ చేయదు. ఆ స్థిరత్వం లేకుండా చంచలంగా ఉన్నావు అనుకోండి... అదే అభ్యాసం.

శి :  ఉన్నది స్థాణువే అని తెలియని వారు, స్థాణువు అని విన్నా కానీ భూతం లాగే కనిపిస్తోంది.

గు : అదేగా మనము ఇప్పుడు మాట్లాడుకున్నది. ఉన్నది స్థాణువే. కానీ విన్నది భూతం. ఉన్న స్థాణువు పనిచేయడం లేదు. విన్న భూతం పనిచేస్తోంది. భగవద్గీత వింటే నీలో జ్ఞానం ఉత్పన్నమవ్వాలి. కానీ ఏమి ఉత్పన్నమవుతోంది?  భయం ఉత్పన్నమైంది. అర్జునుడి యొక్క భయాన్ని పోగొట్టడానికి వాడినటువంటి భగవద్గీత, నీవు వాడుకలో అభ్యాసంలో, వివేకం లేని అభ్యాసం వలన ఏమైపోయింది? భగవద్గీత పెట్టగానే భయం వచ్చింది?  విపరీత జ్ఞానం. అసలు ఉండవలసినది కాదు. విడవవలసినదే నిన్ను మొత్తం ఆక్రమించేసింది.

శి : భూతంలా కనిపిస్తోంది అనుకునే వారు కూడా, ఎంత కష్టపడి అయినా ఈ జ్ఞాన జ్యోతిని సంపాదించి, సత్య దర్శనం పొంది తీరాలి.

గు : కనబడుతున్న దాని గురించి చింతించ మాకా!  దాని గురించి చింతించినంత కాలం, దాని చుట్టూతానే తిరుగుతావు. అథవా! అది కనపడిందే అనుకోండి...

భూతనాధుడు ఎవరు? శివుడు. ఈశ్వరుడిని స్మరించు, ఏమైందపుడు... ఇది కనపడకుండా పోయింది. నీకు కర్మఫలం చేత దోష దర్శనం కలిగిందండి ఏదో ఒకచోట. ఏం చెయ్యాలట వెంటనే ఈశ్వర స్మరణ చేయి. భగవంతుడిని స్మరించు. సద్గురుమూర్తిని స్మరించు. ఆ అనన్య భావంతో ఎప్పుడైతే స్మరించే ప్రయత్నంలోకి వస్తావో... అప్పుడు ఏమైపోతావు? ఇది నిన్ను విడిచి పెట్టేస్తుంది. ఎందుకని... ఇది లేనిది. ఇది అసహజం. ఇది అన్యదాగ్రహణం. కాబట్టి విడిచిపెట్టేస్తుంది.

శి: సత్యం జ్ఞానం అనంతం, అని వర్ణించబడే ఆత్మ స్వరూపాన్ని, పరబ్రహ్మతత్త్వాన్ని సరైన దృష్టితో వెలుగుతో చూడకపోవడం వలన, అనంతనామరూప సమన్వితమైన నామరూప జీవ ఈశ్వర భ్రమను కలిగిస్తూ బాధిస్తోంది. చీకటిలోనుంచి వెలుగులోకి వస్తే చీకటి మాయమైపోతుంది. సరైన జ్ఞాన దృష్టిని సారిస్తే అజ్ఞానం అదృశ్యమైపోతుంది.

గు : కాబట్టి, సాధనంతా దేని మీద దృష్టి నిలపాలి? జ్ఞాన సాధన మీద దృష్టి నిలుపు. అజ్ఞానం అదే పోతుంది. అంతేగాని అజ్ఞానాన్ని తొలగించే ప్రయత్నం చేయకూడదు ఎప్పుడూ కూడా! ఎక్కడ ఉన్నదని తొలగిస్తావు?కళ్ళముందు కనపడే

వస్తువు కాదుకదా అది. కాబట్టి, ఏమి చేయాలట, నిరంతరం జ్ఞాన సాధన మీద నిలబడి జీవించు.

శి : సరైన జ్ఞాన దృష్టిని సాధిస్తే, అజ్ఞానం అదృశ్రమైపోతుంది. చూసే నేను, చూడబడే ప్రపంచం, ఈ చూచి, చూడబడటం అనే సంబంధం వలన సాధ్యమయ్యే అసంఖ్యాక కష్టసుఖాలు కూడా అజ్ఞాన జనితాలే.

గు : అదీ సంగతి , ప్రపంచంలో ఎవరిని కదిలించినా, ఏమి చెబుతారండి? కష్టాలు సుఖాలు. ఏమ్మా మీరు మీ జీవితంలో ఏమి చేసారు? అంటె, నేను ఫలానా పని చేశానండి, ఫలానా కష్టం వచ్చిందండి, ఫలానా కష్టం వస్తే, ఫలానా రకంగా పరిష్కరించానండి, ఇవన్నీ ఏ ఫలితాలట... అజ్ఞాన ఫలితాలు. ఎందుకనిట...కష్టం,సుఖం అనేవి రెండూ లేవక్కడ. అవి రెండూ అన్యదాగ్రహణం వలన వచ్చినాయి. ఆత్మానుభవంలో కష్టం కానీ, సుఖం కానీ, రెండు రెండుగా ఉండేవి ఏవీ అక్కడ లేవు. ద్వైతం లేదు.

శి : చూచే నేను ఎవరో, చూడబడేది ఏమిటో, ఎలా చూడబడుతున్నదో స్పష్టంగా తెలిపే జ్ఞానాన్ని సంపాదిస్తే యథార్ధం బోధపడుతుంది. భ్రమ నశిస్తుంది.

గు : అదిటండి. భ్రమ అంటె ఇందాక ఎక్కడ చెప్పుకున్నాం. బుద్ధి పైన ఉంటుంది. బుద్ధి కర్మానుసారిణి కదండి. కర్మబంధం దేనివలన ఏర్పడినదయ్యా అంటె..., భ్రమ వలన ఏర్పడింది. ఆ కర్మబంధం తొలగిపోవాలంటే, నీకు ఏ జ్ఞానం ఉండాలట. దృక్ దృశ్య వివేకం ఉండాలి. చూచేవాడు  ఎవడు? చూడబడుతున్నది ఏది? ఎలా చూడబడుతుంది? అనేటటువంటి ఆ త్రిపుటి వల్లనే నీకు ఇదంతా కలుగుతోంది. అది కనుక విడిపోయిందా! ఏమైందప్పుడు... భ్రమ తనంతట తానే లేకుండా పోయింది. అది చివరికి వెళ్ళేకొద్దీ ఇంకా విస్తారంగా మాట్లాడుతుంది. దృక్ దృశ్య వివేకం.

హరిః ఓం

శ్రీ గురుభ్యోంనమః

హరిః ఓం